క్లుప్తంగా

పాలిటెక్నిక్ అధ్యాపకులకు ఉత్తమ అవార్డులు

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా టెక్నికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ విభాగానికి సంబంధించి ఘన్‌పూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పోచయ్య, ఎలక్ట్రికల్ హెడ్ రామకృష్ణ, గణితం లెక్చరర్ ఎం.రాజ్‌కుమార్ ఉత్తమ అధ్యాపకులుగా ఎంపికయ్యారు. మంగళవారం నిర్వహించే విద్యాదినోత్సవ వేడుకల్లో కలెక్టర్ చేతులమీదుగా అవార్డులను అందుకోనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

వాటర్ ఫౌంటెన్ పరిశీలన



జనగామ: పట్టణంలోని ఆర్టీసీ చౌరస్తాలో వాటర్ ఫౌంటెన్‌ను ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సోమవారం సాయంత్రం పరిశీలించారు. ఫౌంటేయిన్ నుంచి వాటర్ బయటకు రాకుండా చూడాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పైపులతోపాటు వాటర్ మెయింటనెన్స్ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ ఇన్‌చార్జ్ శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ మల్లిగారి మధు, కౌన్సిలర్ ఎండి సమ్మద్, దేవునూరి సతీష్, గుర్రం నాగరాజు, ఉల్లెంగుల సందీప్ ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రఘునాథపల్లి: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చాగర్ల రఘుపతి సోమవారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. దేవరుప్పుల మండల కేంద్రానికి చెందిన నీరటి క్రాంతి తన తల్లి నీరటి పద్మ పేర ఉన్న ట్రాక్టర్‌తో గుట్టుచప్పుడు కాకుండా దేవరుప్పుల వాగులో నుంచి ఇసుక నింపుకొని కోడూర్ మీదుగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నామన్నారు. నీరటి క్రాంతితో పాటు తన తల్లి పద్మలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విమర్శలు సరికాదు

పాలకుర్తి: మండలంలోని చెన్నూరు గ్రామానికి చెందిన గౌడ సొసైటీకి వేణు అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని యువజన సంఘం నాయకులు పేర్కొన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ వేణు అక్రమాలకు పాల్పడుతున్నారని మూల వెంకటేశ్వర్లు విమర్శ చేయడం సరికాదన్నారు. వేణు బహిరంగంగా ఎన్నికయ్యారని వారు తెలిపారు. సహకార సంఘం మండల అధ్యక్షుడు మూల మహేష్, మాదాను హరిష్, సాయికుమార్, నరేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణయ్య హత్యపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

బచ్చన్నపేట: మండలంలోని పోచన్నపేటకు చెందిన రిటైర్డ్ ఎంపీడీఓ నల్ల రామకృష్ణయ్య హత్యపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ పైస రాజశేఖర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. రామకృష్ణయ్య హత్య వెనుక ఎంత మంది ఉన్నారో విచారణ చేసి నిందితులకు కఠినశిక్ష పడేలా చూడాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ అల్వాల రాజు, నాయకులు అల్వాల అనిల్, బావండ్లపెల్లి శ్రీకాంత్, తరుణ్, మహేష్, యాదగిరి, ఎల్లయ్య, సురేష్, సాయిబాబు పాల్గొన్నారు.

నిజనిర్ధారణ కమిటీ వేయాలి..

రిటైర్డ్ ఎంపీడీఓ నల్ల రామకృష్ణయ్య హత్యపై నిజనిర్ధారణ కమిటీ వేయాలని జాక్ చైర్మన్, సివిల్ లిబర్టీస్ హైకోర్టు న్యాయవాది చక్రధారి అన్నారు. సోమవారం రామకృష్ణయ్య హత్య జరిగిన స్థలాన్ని సందర్శించిన అనంతరం మాట్లాడారు. బాధిత కుటుంబ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. అలాగే హత్య విషయంపై సమగ్ర విచారణ జరపాలని ఏఐసీసీ సభ్యుడు, దివ్యాంగుల సంఘం రాష్ట్ర మాజీ చైర్మన్ బక్క జడ్సన్.. డీజీపీకి ఫిర్యాదు చేశారు.

నిందితులను శిక్షించాలి

పాలకుర్తి టౌన్: బచ్చన్నపేట మండలం పోచన్న పేటకు చెందిన రిటైర్డ్ ఎంపీడీఓ నల్ల రామకృష్ణయ్య హత్య ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాయపర్తి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఐలమ్మ స్మారక భవన్‌లో సీపీఎం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రామకృష్ణయ్య మృతిపై కుటుంబ సభ్యుల ఆరోపణలన్నింటిని ఉన్నతాధికారులు పరిగణలోకి తీసుకొని సమగ్ర దర్యాప్తు జరపాలన్నారు.

మార్కెట్ చైర్మన్‌ను కలిసిన కార్యదర్శి

జఫర్‌గఢ్: ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ నూతన కార్యదర్శిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జన్ను భాస్కర్ తమ్మడపల్లి(జి)లో మార్కెట్ చైర్మన్ గుజ్జరి రాజును సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు.

కొడకండ్ల: హరితోత్సవంలో పాల్గొన్న డీఆర్డీఓ రాంరెడ్డి తదితరులు



నర్మెట: మొక్కలు నాటుతున్న ఎస్సై అనిల్‌కుమార్ తదితరులు



బచ్చన్నపేట: ఇటుకాలపల్లిలో..



మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా హరితోత్సవం కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లో మొక్కలు నాటారు. అనంతరం పలువురు మాట్లాడుతూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, జీపీ సిబ్బంది, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



చిల్పూరు: మొక్కలు నాటుతున్న అర్చకులు



శామీర్‌పేటలో.. ఎంపీపీ మేకల కళింగరాజు



దేవరుప్పులలో..



రఘునాథపల్లిలో మొక్క నాటి నీరు పోస్తున్న సీఐ సంతోష్, సర్పంచ్ శివకుమార్



లింగాలఘణపురం: నవాబుపేట రిజర్వాయర్ వద్ద సంపద వనం బోర్డును ఏర్పాటు చేస్తూ..



స్టేషన్‌ఘన్‌పూర్: హరితోత్సవంలో సర్పంచ్ తాటికొండ సురేష్‌కుమార్



పాలకుర్తి సోమేశ్వరాలయంలో..

ఏబీవీపీ నాయకుల ముందస్తు అరెస్ట్

జనగామ రూరల్: మండలంలోని శామీర్‌పేటలో దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొననున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిని ఏబీవీపీ నాయకులు అడ్డుకొంటారని తెలిసి వారిని ముందస్తుగా పోలీసులు అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో పొన్నాల రమేష్, తాంగ్ర అభినయ్, గుంటుపల్లి కార్తీక్, నరేష్ ఉన్నారు. ఈ సందర్భంగా ఏబీవీపీ వరంగల్ విభాగ్ కన్వీనర్ చింతకింది సంతోష్ మాట్లాడుతూ అక్రమ అరెస్టులు సరికాదని అన్నారు.

'హత్య కేసులో పోలీసుల నిర్లక్ష్యం'

బచ్చన్నపేట: మండలంలోని నక్కవానిగూడెం శివారు గ్రామమైన సదాశివపేటలో సుభద్ర అనే మహిళ హత్య కేసులో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని తీన్మార్ మల్లన్న టీం జిల్లా అధ్యక్షుడు తుప్పతి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం అక్టోబర్‌లో సుభద్రను వ్యవసాయ బావి వద్ద హత్య చేశారని ఫిర్యాదు చేయగా సీఐ నాగబాబు, ఎస్సై నవీన్‌కుమార్ హత్య కోణంలో విచారణ చేపట్టలేదన్నారు. శవానికి పోస్టు మార్టం, ఫోరెన్సిక్ నివేదిక సేకరణల పేరుతో కాలయాపన చేశారన్నారు. అలాగే రిటైర్డ్ ఎంపీడీఓ, మృతుడు నల్ల రామకృష్ణయ్య కిడ్నాప్ విషయంలో కూడా కాలయాపన చేయడంతో నిండుప్రాణం గాలిలో కలిసిందన్నారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి భర్త అంజయ్యకు పోలీసులు వత్తాసు పలికారని అన్నారు. వెంటనే సీఐ, ఎస్సైలపై విచారణ జరిపించి సస్పెండ్ చేయాలని సీపీ రంగనాథ్‌కు లేఖ రాసి పంపించామని తెలిపారు.

తల్లీ బిడ్డల ఆరోగ్యానికి న్యూట్రిషన్ కిట్లు

- డీఎంహెచ్‌ఓ ప్రశాంత్

కొడకండ్ల: తల్లీ బిడ్డల ఆరోగ్యానికి ప్రభుత్వం అందిస్తున్న న్యూట్రిషన్ కిట్లు దోహదపడతాయని డీఎంహెచ్‌ఓ ప్రశాంత్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన సోమవారం పరిశీలించి ఏఎన్‌సీ క్లినిక్‌కు వచ్చిన నలుగురు గర్భిణులకు కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత మహిళలు రక్తహీనత సమస్యలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో పోషకాల లోపాన్ని నివారించడానికి ప్రభుత్వం న్యూట్రిషన్ కిట్ల పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. ఒక్కో కిట్‌లో కిలో న్యూట్రిషన్ పౌడర్, ఖర్జూరాలు, మూడు ఐరన్ సిరప్లు, నెయ్యి, క్యాల్షియం మాత్రలు, అల్బెండజోల్ మాత్ర, కప్పు ఉంటాయని చెప్పారు. ఈ పోషక పదార్థాలతో గర్భిణుల్లో హిమోగ్లోబిన్ స్థాయి పెరగడంతో పాటు సూక్ష్మ పోషకాలను మెరుగు పర్చి కడుపులో శిశువు బరువు పెరిగేందుకు దోహదపడతాయన్నారు. ఈ కిట్లను గర్భిణులకు రెండు విడతల్లో అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంసీహెచ్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవీందర్‌గౌడ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధీర్, స్థానిక డాక్టర్ హరికృష్ణ, సీహెచ్‌ఓ దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ పీహెచ్‌సీలో..

జనగామ రూరల్: పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం 28 మంది గర్భిణులకు పరీక్షలు నిర్వహించి కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లను వైద్యాధికారి శరత్‌కుమార్, డాక్టర్ విద్య అందజేశారు. సామాజిక వైద్యాధికారి రహమాన్, సూపర్‌వైజర్ ఉపేంద్ర, రవీందర్ పాల్గొన్నారు.



కొడకండ్ల: కిట్లు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ

ప్రజారోగ్య పరిరక్షణకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి

దేవరుప్పుల: ప్రజారోగ్య పరిరక్షణకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని ఎంపీపీ బస్వ సావిత్రి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారిణి డాక్టర్ పూజ ఆధ్వర్యంలో గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ హయాంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక వసతులు, మెడికల్ కళాశాలలు విస్తృతంగా పెరిగాయన్నారు. సర్పంచ్ రమాదేవి, ఉపసర్పంచ్ దశరథ, ఎంపీటీసీ సభ్యురాలు రేణుక, ఆరోగ్య సిబ్బందితోపాటు తదితరులు పాల్గొన్నారు.

సీపీకి ఆహ్వానం



చిల్పూరు: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 21న మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే ఆధ్యాత్మిక దినోత్సవానికి హాజరవ్వాలని సోమవారం సీపీ రంగనాథ్‌కు ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, అర్చకులు రవీందర్ శర్మ మాట్లాడుతూ దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఆధ్యాత్మిక దినోత్సవం కోసం ఆలయ శాశ్వత దాతలు, భక్తులకు ఆహ్వాన పత్రాలను అందజేసినట్లు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

చిల్పూరు: కృష్ణాజీగూడెం గ్రామానికి చెందిన తొట్టి దేరాలు, దాసరి రాజ్‌కుమార్‌లకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్సీ కడియం శ్రీహరి సోమవారం అందజేశారు. కడియం యువసేన మండల అధ్యక్షుడు జక్కుల రాజయ్య, మాజీ ఎంపీటీసీ మారపాక ఐసాక్ ఉన్నారు.

23న వాహనాల వేలం

పాలకుర్తి: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జనగామ స్టేషన్.. పాలకుర్తి పరిధిలో పట్టుబడిన వాహనాలను ఈనెల 23న వేలం ద్వారా విక్రయించనున్నట్లు ఇన్‌స్పెక్టర్ సంతోష్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రెండు ద్విచక్ర వాహనాలను రూ. 5,000 డిపాజిట్ తీసుకుని వేలం వేయడం జరుగుతుందని అన్నారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనాలని సూచించారు.

సర్టిఫికెట్ల కోసం ఆందోళన

రఘునాథపల్లి: బీసీ కులవృత్తులకు రూ.లక్ష ఆర్థిక సాయం పథకానికి, ఉన్నత చదువులకు అవసరమయ్యే ఆదాయ కుల ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న బాధితులు సోమవారం తహసీల్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. దరఖాస్తు చేసి పదిరోజులు కావస్తున్నా సర్టిఫికెట్లు జారీ చేయడంలేదంటూ కార్యాలయం ముందు కొద్ది సేపు బైఠాయించి రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం విడనాడాలని నినాదాలు చేశారు. రూ.లక్ష పథకానికి చివరి గడువు 20వ తేదీ అని ఎలా దరఖాస్తు చేసుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరికి సీపీఎం మండల కార్యదర్శి గంగాపురం మహేందర్, రామన్నగూడెం మాజీ సర్పంచ్ ఎండీ యాకూబ్ మద్దతుగా నిలిచి ఆందోళనలో పాల్గొన్నారు. ఆర్‌ఐలు బలరాం, అన్వేష్ అక్కడికి వచ్చి సర్వర్ డౌన్ కారణంగా జాప్యం జరుగుతోందని, సర్టిఫికెట్లు అవసరమగు వారి పేర్లు నమోదు చేసుకోవడంతో వారు శాంతించారు. ఈ విషయమై తహసీల్దార్ ఎండీ అన్వర్‌ను వివరణ కోరగా సర్వర్ సమస్యతో జాప్యం జరుగుతోందని, ఇప్పటి వరకు 2,000లకు పైగా దరఖాస్తులు వచ్చాయని, రెండు ప్రత్యేక టీంల ద్వారా 1,600 సర్టిఫికెట్లు జారీ చేసినట్లు చెప్పారు. మిగతావి రేపటిలోగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు.



తహసీల్ వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

చిల్పూరు: మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట శేషాద్రి నిలయంలో పల్లగుట్ట పాఠశాల 1994–95 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. తమకు పాఠాలు చెప్పిన గురువులను శాలువాలతో సత్కరించారు. వేల్పుల గట్టయ్య, జ్యోతి, రజిత, సతీష్, రాజేంద్రప్రసాద్, రాజు, ప్రకాష్, శ్రీను, సంపత్, లింగయ్య, కుమార్, బాలరాజు, ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ, ఆర్థికసాయం

కొడకండ్ల: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మండలకేంద్రానికి చెందిన ఐదో వార్డు సభ్యుడు పాడిశెట్టి వీరస్వామి కుటుంబసభ్యులను సోమవారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా వీరస్వామి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించి ప్రగాఢ సానుభూతిని తెలిపి ఆర్థికసాయం అందజేశారు. ఈజీఎస్ డైరెక్టర్ అందె యాకయ్య, మార్కెట్ చైర్మన్ రాము, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సిందె రామోజీ, సర్పంచ్ మధుసూధన్, కోఆప్షన్ నసీరుద్దీన్, మార్కెట్ డైరెక్టర్ అమరేందర్‌రెడ్డి, వెంకటనారాయణ, సతీష్‌గౌడ్, రమేష్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

బచ్చన్నపేట: మండల కేంద్రంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న అవధూత ఉమేష్ కుటుంబ సభ్యులకు తోటి ఎస్‌ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. జనగామ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ లగిశెట్టి అశోక్‌కుమార్ రూ. 30 వేలు, 1998–99 బచ్చన్నపేట టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ. లక్ష అందించారు. ఆర్థికసాయం అందజేసిన పూర్వవిద్యార్థులను గ్రామస్తులు అభినందించారు.

పల్లగుట్టలో..

చిల్పూరు: మండలంలోని పల్లగుట్టకు చెందిన కడియం యువసేన నాయకుడు దాసరి సత్తయ్య భార్య ఆగమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. కాగా, సోమవారం కడియం యువసేన మండల నాయకులు డాక్టర్ పేరాల సుధాకర్ ఆధ్వర్యంలో కన్నెబోయిన మల్లేషం, వెంకట్రాజం, గుర్రం యాదగిరి, డిష్‌రాజు, కుంచాల రాజు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.



బచ్చన్నపేట: ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

వైస్ ఎంపీపీకి..

జఫర్‌గఢ్: మండలంలోని ఉప్పుగల్లుకు చెందిన మండల వైస్ ఎంపీపీ కొడారి కనకయ్య కుమారుడు లోకేష్ ఇటీవల మృతిచెందాడు. కాగా, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి సోమవారం ఉప్పుగల్లులో బాధిత కుటుంబీకులను పరామర్శించారు. లోకేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయండి

జనగామ రూరల్: మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆర్థికంగా ఆదుకోవాలని సంఘం జిల్లా నాయకుడు నల్లగొండ మహేందర్ అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఏఓ మన్సూరీకి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. నాయకులు నారాయణ, వంతుల ప్రభాకర్, కొంతం శ్రీనివాస్, చంద్రమౌళి, వెంకన్న, నర్సింగరావు, ఉపేందర్, చిరంజీవి పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆలయ అభివృద్ధికి సహకరించాలి

బచ్చన్నపేట: మండలంలోని కొడవటూర్‌లో స్వయంభూ శ్రీ సిద్దేశ్వరాలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని దేవాదాయ శాఖ సహాయ స్థపతి ఈశ్వరాచారి కోరారు. సోమవారం ఆలయ రాజగోపుర నిర్మాణానికి హద్దులను నిర్ణయించారు. అనంతరం మాట్లాడుతూ దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆలయ మిగులు నిధుల నుంచి కమిషనర్ ఆదేశాల మేరకు మార్కింగ్ ఇచ్చామన్నారు. గోపుర నిర్మాణ పనులు కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి చిందం వంశీ, ఆలయ ప్రధాన పూజారి ఓం నమశివాయ, సిబ్బంది చల్ల రాజేందర్‌రెడ్డి, మధు, క్రాంతి, భానుప్రకాష్‌రెడ్డితోపాటు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

భారత్ జోడో యాత్ర రథసారథి, ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సోమవారం ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆస్పత్రుల్లో పండ్లు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజలంతా కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తున్నారని, భారత్‌జోడో యాత్రతో పార్టీలో జోష్ వచ్చిందని, భావిభారత ప్రధాని రాహుల్ గాంధీ అన్నారు. కార్యక్రమాల్లో రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

– జనగామ/స్టేషన్‌ఘన్‌పూర్/బచ్చన్నపేట/కొడకండ్ల/తరిగొప్పుల/పాలకుర్తి టౌన్



జనగామ: కేక్ కట్ చేస్తున్న పొన్నాల వర్గీయులు



జనగామ: కొమ్మూరి వర్గం ఆధ్వర్యంలో..



స్టేషన్‌ఘన్‌పూర్: కేక్ కట్ చేస్తున్న నాయకులు



రఘునాథపల్లి: కంచనపల్లిలో..



బచ్చన్నపేటలో..



తరిగొప్పులలో..



కొడకండ్లలో..



పాలకుర్తిలో..

చర్య తీసుకోవాలి

దేవరుప్పుల: బక్రీద్ పండుగ పురస్కరించుకొని విస్తృతంగా జరిగే గోవధను ప్రభుత్వం నిలువరించే చర్యలు తీసుకోవాలని తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్, ప్రధాన కార్యదర్శి కమలేష్‌దాస్ మహారాజ్, భారత్ హిందూ మహాసభ, టీటీడీ సభ్యుడు అఖిల్ ఒక సంయుక్త ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పశుసంపద అంతరించిపోకుండా పరిరక్షించేందుకు ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. పశువుల అక్రమ రవాణాను నివారించేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌లు, పోలీసుల ముందస్తు బైండోవర్లు, చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని వారు కోరారు.

ఆలయ భూములు కాపాడాలి

తరిగొప్పుల: మండలకేంద్రంలోని శ్రీభక్త మార్కండేయ ఆలయ భూమిని కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారని వారినుంచి భూమిని కాపాడాలని తరిగొప్పుల గ్రామ పద్మశాలీ సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం వారు తహసీల్దార్ బాశెట్టి హరిప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ సర్వేనంబర్ 6లో 23 గుంటలు భూమి కృష్ణమరాజు కాంతరావు, వెంకట నర్సింహారావు, వేదాంతరావు, జక్కారావులు గతంలో పద్మశాలి సంఘం కులపెద్దలకు శ్రీభక్త మార్కండేయ స్వామి ఆలయ నిర్మాణానికి విరాళంగా ఇవ్వడం జరిగిందన్నారు. ఆట్టి భూమిని ఇప్పుడు మండలకేంద్రానికి చెందిన కొందరు వ్యక్తులు కబ్జా చేయాలని చూస్తున్నారని వాపోయారు. అధికారులు కబ్జా కోరుల నుంచి ఆయన భూమిని రక్షించాలని కోరారు. అధ్యక్షుడు మచ్చ యాదగిరి, అంకం బిక్షపతి, అంకం శ్రీనివాస్, అంకం సత్తయ్య, వెంకటేష్, తలకొక్కుల రవి, సత్తయ్య, రామచంద్రం, ఉప్పలయ్య, రాజు ఉన్నారు.



వినతిపత్రం చూపిస్తున్న సంఘం సభ్యులు